నిత్యం ట్రాఫిక్ కష్టాలు!


లంకెలపాలెం వంతెనపై ఇటీవల నిలిచిపోయిన బూడిద లారీలు, ఇతర వాహనాలు

పరవాడ: లంకెలపాలెం–పరవాడ రహదారిలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు తరచూ లంకెలపాలెం వంతెనపై నిలిచిపోతుండడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ కారణంగా ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎన్టీపీసీ బూడిద లారీలు, ఎస్ఈజెడ్, హిందూజా పరిశ్రమలకు చెందిన బొగ్గు లారీలతో పాటు ఇతర భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. అదే విధంగా విశాఖ, గాజువాక, ఫార్మాసిటీ ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, పట్టణ ప్రాంతాల్లో లావాదేవీలు జరిపే వ్యాపారులు ఈ రహదారి మీదుగానే ప్రయాణిస్తుంటారు. ఎన్టీపీసీ కారిడార్ రహదారి మీదుగా వచ్చే బూడిద లారీలు లంకెలపాలెం వంతెన మీదుగా ఇతర ప్రాంతాలకు వెళుతుంటాయి. విశాఖ మీదుగా వచ్చే బొగ్గు లారీలు లంకెలపాలెం వంతెన మీదుగా హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎన్టీపీసీ కారిడార్ రహదారిలో ప్రయాణించే బూడిద లారీలు మరమ్మతులతో రోడ్డు మధ్యలో నిలిచిపోవడం వంటి కారణాల వల్ల వంతెనపై నిలిచిపోతున్నాయి. ఫలితంగా పరవాడ–లంకెలపాలెం రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా రెండు రోజుల కిందట వంతెనపై లారీ నిలిచిపోవడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో రోడ్డు పొడవునా బొగ్గు, బూడిద లారీలు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. అధికారులు స్పందించి సమస్యను చక్కదిద్దడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఈ క్రాప్ జాబితాలో సవరణకు అవకాశం

సబ్బవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు సాగుచేసిన అన్ని పంటల ఈ క్రాప్ నమోదు పూర్తి చేశామని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు.దీనికి సంబంధించి రైతులు వేసిన పంటల వివరాల ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీల కోసం అన్ని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకేలు)ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ ప్రదర్శించడం జరుగుతుందన్నారు.అదే విధంగా దీనిపై గ్రామ సభలు కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు.పంటలు వేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రంలో ఉన్న వీఏఏ,వీహెచ్‌ఎలను సంప్రదించి రాతపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. తుది జాబితా ప్రదర్శించిన తర్వాత ఎలాంటి మార్పులు చేయడం కుదరదని స్పష్టం చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు చేశారు.ఉదయం నుంచి మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్లి ఎను, గొర్లి కుమార్, గొంప ముత్యాలనాయుడు,జక్కాన శ్రీరాంమూర్తితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం


కోట్నీవానిపాలెం అమ్మవారి ఊరేగింపు

పెందుర్తి: మండలంలోని గొరపల్లి, కోట్నివాని పాలెం గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఆయా గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. డప్పువాయిద్యాల నడుమ నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


రాము మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం చాకలి గెడ్డ ప్రాంతంలో నివసిస్తున్న డి.రాము(55) గతంలో తాపీమేస్త్రిగా పనిచేసేవాడు. రెండేళ్ల నుంచి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య డి.లక్ష్మి ఉదయం 10 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి గదిలో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహం కేసు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో ద్విచక్రవాహనాలను ఢీకొన్న కారు

సబ్బవరం: సబ్బవరం–చోడవరం రోడ్డులోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. మాడుగుల మండలంలోని అవురువాడ పంచా యతీ సీతబందలు గ్రామానికి చెందిన ఎస్.చంటి,ఎస్. కృష్ణ ఒక ద్విచక్రవాహనంపై, ఎం. రాజు, కె. రాజు మరో ద్విచక్రవాహనంపై మంగళవారం సాయంత్రం సింహాచలంలోని బంధువుల పెళ్లికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో లగిశెట్టిపాలెం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు బలంగా రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొట్టింది. దీంతో వెనుక, ముందు వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు చెల్లాచెదురుగా తూలిపోయాయి. కారు రోడ్డు పక్కన ఉన్న పిక్క కుప్పపైకి వెళ్లి నిలిచిపోయింది. దీంతో ఒక ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న ఎస్. కృష్ణకు,రెండో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎం. రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సబ్బవరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. మిగిలిన ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయని బాధితుల బంధువు కొండబాబు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15న చలో విజయవాడ


చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: ప్రజా రక్షణకు నవంబర్ 15న చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను బుధవారం పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ, బీజేపీలు పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. దీనిపై ప్రజా రక్షణ భేరిలో భాగంగా నవంబర్ 1న నుంచి రాష్ట్రంలో మూడు ప్రాంతాలలో బస్సు యాత్ర నిర్వహించనున్నామన్నారు. ఈ యాత్ర నవంబర్ 3న విశాఖపట్నం, పెందుర్తి జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. 4న ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం, పూర్ణామార్కెట్, శ్రీహరిపురం, గాజువాక, కూర్మన్నపాలెంలో బస్సు యాత్రలు చేరుకుని, సభలు జరుగుతాయన్నారు. 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్కే ఎస్వీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారంపై ప్రవచనం


ప్రవచిస్తున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య దత్తాత్రేయ శాస్త్రి

సీతంపేట: కంచికామకోటి శంకరమఠం, గీతా ప్రచార సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీమద్ భగవద్గీత సారంపై శంకరమఠం ప్రాంగణంలో ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి భగవద్గీత సారంపై ప్రవచనం చేసి దాని విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు, పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలను నియమించుకోవాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈఆర్వో సూచన


మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లక్ష్మా రెడ్డి

గాజువాక: ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి డి. లక్ష్మారెడ్డి గాజువాక జీవీఎంసీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీ లు, రాజకీయ పక్షాలతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ – 2024కు సంబంధించిన షెడ్యూల్‌ను సమావేశంలో పాల్గొన్న వారికి చదివి వినిపించారు. రేషనలైజేషన్ తర్వాత గాజువాక నియోజకవర్గంలోని 302 పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన భాగం పేరు, పోలింగ్ ఏరియా, పోలింగ్ స్టేషన్ వివరాలకు సంబంధించిన ప్రింటెడ్ కాపీలను సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. రేషనలైజేషన్ ప్రక్రియలో పాత పోలింగ్ కేంద్రం, కొత్త పోలింగ్ కేంద్రాల మధ్య అనుసంధానం తెలియజేసే జాబితాను రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ కేంద్రాలు మారిన కారణంగా ప్రతీ పోలింగ్ కేంద్రానికి బీఎల్‌ఏలను నియమించుకోవాలని రాజకీయ పార్టీలను కోరారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు శ్రీవల్లి, రమాదేవి, హెచ్ డీటీలు త్రినాథ్, పద్మలత, అఖిలపక్ష నాయకుడు రంజిత్, నిఖిల్, ముత్యాలు, శంకర్, గోవిందు, అర్జున్, రమేష్, పల్లా రమణ పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు


ప్రశంసాపత్రాలతో చిన్నారులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకించడం ఆనవాయితీ అని ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈవో రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్ర ఎరుకుమాంబ ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సిరి డ్యాన్స్ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 9885181097

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెందుర్తి: మండలంలోని వాలిమెరక జుత్తాడలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలు.. కోడి అచ్చిబాబు(45) భార్య రామలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న అచ్చిబాబు మద్యానికి బానిస కావడంతో తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇద్దరికీ తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. ఈ క్రమంలో అచ్చిబాబు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గ్రామంలో గాలించారు. బుధవారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని ఓ తోటలో అచ్చిబాబు విగతజీవిగా కనిపించాడు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో జరిగిన వివాదం కారణంగా అచ్చిబాబు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

యువతి అదృశ్యం


అంజలి(ఫైల్)

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పరిధిలో ఓ యువతి అదృశ్యమైనట్టు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్ లయన్స్ క్లబ్ వద్ద తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్న చిత్తరపు అంజలి(24) ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఎప్పటిలాగే ఈ నెల 19వ తేదీ ఉదయం ఆఫీసుకు ఆమె బయలుదేరింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజలితో కలిసి పని చేస్తున్న దేవేంద్రరెడ్డి అని వ్యక్తిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన సీఐ రామారావు విచారణ ప్రారంభించారు.

జూలో ఆట పరికరాల ఏర్పాటు


ఆట పరికరాల వద్ద ఆటలాడుతున్న పిల్లలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కుకు వెళ్లే పిల్లలు వన్యప్రాణుల సందర్శనతో పాటు ఎంచక్కా ఆటలాడుకోవచ్చు కూడా. ఇక్కడ వందల సంఖ్యలో వన్యప్రాణులున్నాయి. వాటిని తిలకించడంతో పాటు సరదాగా ఆడుకోవడం కోసం ఇటీవల జూ అధికారులు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. జూలో నీటి ఏనుగుల కొలను ఎదురుగా క్యాంటీన్ పక్కన ఖాళీ స్థలంలో ఊయల, జారుడు బల్లలు, తేగుడు బల్ల తదితర ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. వాటి వద్ద పిల్లల సందడి ఎక్కువగా ఉంటోంది.

రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని సీతారామాలయ పునర్నిర్మాణానికి కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ దంపతులు భూమి పూజ చేశారు. కార్పొరేటర్ వరలక్ష్మి మాట్లాడుతూ అధునాతన రీతిలో ఆలయ నిర్మాణ పనులు చేపట్టేందుకు గ్రామస్తులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు, ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు విందుల నారాయణరావు, అమరపిని గోవింద, విందుల వెంకటరమణ,బి. నాగేశ్వరరావు, అఖిల పక్షాల నాయకులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతికి కార్మిక శక్తి కీలకం


రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక ప్రగతికి కార్మిక శక్తి అత్యంత కీలకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. అటువంటి కార్మిక శక్తిని విస్మరించి, కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం చరిత్రలో బాగు పడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 986వ రోజు బుధవారం స్టీల్‌ప్లాంట్ ఈఎస్ఎఫ్, ఈఆర్ఎస్, సేఫ్టీ, ఈఎండీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు సంస్థను కాపాడుకునేందుకు ప్రజలు ఆందోళన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు


స్వర్ణ తులసీదళాలు


యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జితసేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణతులసీదళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. ఉభయదాతలను స్వర్ణ తులసీ దళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహి స్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలు అందజేశారు.

➡ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

'పరవాడ'ను కరువు మండలంగా గుర్తించాలి


బీడు భూమి వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, రైతులు

పరవాడ: వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం పరవాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వర్షాలు లేక బీడు భూములుగా మారిన ప్రాంతాలను బుధవారం గనిశెట్టి పరిశీలించారు. మండలంలో పరవాడ, తానాం, వెన్నలపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. వర్షాలు సకాలంలో కురవక పోవడంతో కొన్ని గ్రామాల్లో పంటలు వేయలేదని.. వేసిన చోట ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అధికారులు స్పందించి పరవాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్.అప్పారావు, జి.అప్పారావు, కన్నమనాయుడు, రమణమ్మ పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో తనిఖీలు


దేవేంద్రనగర్ రేషన్ డిపోలో తనిఖీలు చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

కంచరపాలెం: కంచరపాలెం సర్కిల్–1 పరిధి దేవేంద్రనగర్, ధర్మానగర్, రెడ్డికంచరపాలెం రవీంద్రనగర్ ప్రాంతాల్లోని పలు రేషన్ డిపోల్లో బుధవారం సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్–1 ఏఎస్‌వో మురళీధర్ మాట్లాడుతూ రేషన్ సరకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపోల్లో తనిఖీలు చేసి సరకులు, కార్డు హోల్డర్ల వివరాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరకులు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే డిపో లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమణ, లలిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరి


కథానిక చదువుతున్న అయ్యలసోమయాజుల ప్రసాద్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కథా కచేరి అలరించింది. కథకుల స్వీయ కథా పఠనం, వైవిధ్యంతో నిండిన కథలు అందరినీ ఆలోచింపజేశాయి. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు కథకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లని, కథల్లో వివిధ రకాలను వివరించారు. డాక్టర్ కె.జి.వేణు విశిష్ట కథా పరిచయం శీర్షికలో రచయిత ఈతకోట సుబ్బారావు కథానిక ప్రాణం ఖరీదును చక్కగా విశ్లేషించారు. అనంతరం జరిగిన కథా కచేరీలో భాగవతుల సత్యనారాయణ మూర్తి కథానిక మానవత్వం ఖరీదు, కె.వి.ఎస్. మూర్తి కథానిక అనసూయమ్మ గారి ఆరోప్రాణం, అయ్యలసోమయాజుల ప్రసాద్ దమయంతమ్మ దసరా పండగ కథానిక, కుప్పిలి భీమేశ్వరరావు దిక్సూచి కథానిక, కొత్తూరి రమణ పెళ్లిపుస్తకం కథానికలు వివిధ అంశాలను సృజించి అలరించాయి. కార్యక్రమంలో సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు, కె.రాంప్రసాద్, వేదుల కామేశ్వరశర్మ, శ్రీనివాసరావు, రాధారాణి పాల్గొన్నారు.

సర్వాంగ వజ్రకవచధారుడిగా వైభవుడు


వైభవ వేంకటేశ్వర స్వామి


అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న వాత్సల్య బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వొమ్మి వాత్సల్య బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులకు అలరించాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పరిశీలించారు.

'మహిళలకు పని ప్రదేశంలో కూర్చునే హక్కు కల్పించాలి'

మర్రిపాలెం: శ్రామిక మహిళలకు పనిప్రదేశాల్లో కూర్చునే హక్కు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ విభాగం చైర్మన్ మూల వెంకటరావు బుధవారం డిమాండ్ చేశారు. షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళలకు కూర్చునే హక్కు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చట్టం తేవాలని కోరారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ తరహా చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. షాపింగ్ మాల్స్‌లో మహిళలు కూర్చోడానికి కుర్చీలు, స్టూళ్లు, బల్లలు ఏమీ ఉండవని పేర్కొన్నారు. వారు అధిక సమయం నిలబడి ఉండటం వల్ల మూత్రాశయ వ్యాధులు, కాళ్లపై వెరికోస్, వేయిన్స్, వెన్నుపూస, నడుం నొప్పి వంటి రుగ్మతలు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు కూడా అధికంగానే ఉన్నాయన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com